# వాళ్ళిద్దరూ-నేను

## —విహారి

బోనులో పడ్డ సింహంలా,

రెండు రోజులు — ఉస్మానియా హాస్పటల్లో గడిపి అప్పుడే ఇంటికి చేరేను.

మా మావగారికి జబ్బుగా వుంటే చూసిపోదామని సతీసమేతంగా వచ్చాను. పదేళ్ల తర్వాత హైదరాబాద్ నగరాన్ని చూసేను. వచ్చిన మర్నాడే ఆయనకి వ్యాధి ముదరడం, హాస్పటల్లో చేర్చడం జరిగింది.

రెండు రోజులు పూర్తిగా నేనూ, శారదా హాస్పటల్లోనే వుండిపోవాల్సి వచ్చింది. ఈ పూట ఆయన పరిస్థితి కొంత మెరుగయింది.

కనీచీకటి పడింది. శారద దొడ్లో బావి దగ్గర బట్టలు వుతుకుతోంది. తనూ నాతో వచ్చింది యింటికి. హాస్పటల్లో మా మావగారి చెల్లెళ్లున్నారు.

నాకు ఆకలి వుధృతంగా వుంది.

మధ్య హాల్లో కూర్చుని తన భర్త అనారోగ్యం గురించిన వివరాల్ని పక్కింటివాళ్లకి చెప్తోంది మా అత్తగారు. వాళ్ళు సానుభూతిని పొడి పొడి మాటల్లో పంచుతున్నారు.

స్నానం చేసి వచ్చాను.

ఇంకా వంట ప్రయత్నానికి ఎవ్వరూ పూనుకోలేదు. శారదని గదిలోకి పిల్చి చెప్పేను— 'నాకు బాగా ఆకలేస్తోంది. ఉదయం ఎనిమి దింటికి కొరికిన మెతుకులు. త్వరగా వంట కానీ' అని.

ఆమె తల వూపుతూ వంటింట్లో ప్రవేశించింది.

నేనేదో పత్రికని చేతపుచ్చుకుని కూర్చున్నాను.

అదిగో సరిగ్గా అప్పుడు వచ్చాడు రామదాసు.

రామదాసు నాకున్న వొకేవొక బావమరది.

తల్లీ దండ్రీ అంటే అతనికి ఉదాసీనత. పెళ్లాం పిల్లల్తో వేరేచోట కాపరం. భార్య తరఫునుంచీ మంచి ఆస్తే వచ్చింది. ఆమె ఆడించినట్లు ఈయన ఆడతాడంటూ వుంటారు మా అత్తా మావా. రామదాసుకి ముగ్గురు పిల్లలు. చిన్నవాళ్లు. అతను వొక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తాడు.

"చాలా కాలమైంది మనం కలిసి" అంటూ మాట కలిపేడు. నేనొక పరిచయ మందహాసం చేసి వూరుకున్నాను.

"ఇప్పుడు కులాసాగానే వుందిగదా" అంటూ సంభాషణ మార్చి— తల్లిని పరామర్శించాడు, తండ్రి పరిస్థితి గురించి. "ఏమి కులాసానో యేమో... ఇంకా రెండ్రోజులు చూడాలన్నారు డాక్టరు" ఆమె నీరసంగా జవాబిచ్చింది.

"గోపాల్ని త్వరపడి వుద్యోగంలో చేర్పించేవ్. వాణ్ణి ఎం. ఏ. వరకూ చదవనివ్వాల్సింది." నావైపు చూస్తూ అన్నాడు. గోపాల్ మా పెద్దబ్బాయి.

"మంచి ఉద్యోగం. దానంతట —అది వచ్చింది. ఎమ్మే పాసైన తర్వాతైనా మళ్ళీ యిలాంటి వుద్యోగాల వేటలోనే పడాలి గదా" అన్నాన్నేను.

"అదీ నిజమేననుకో... అయినా..." అంటూ నసిగేడు, రామదాసు.

ఇంతలో శారద భోజనానికి పిల్చింది.

ఇద్దరమూ భోజనం చేశాము. రామదాసు అక్కయ్యాని అవీ ఇవీ అడుగుతూ కూర్చున్నాడు.

నేను బయటికి వచ్చి, ఆరుబయట మంచం వేసుకుని, వేపచెట్టు కిందుగా పడుకున్నాను.

క్షణాల తర్వాత రామదాసు అక్కడికొచ్చేడు, స్టూలుమీద కూర్చున్నాడు. "అలా బయటికి పోయొద్దాం పద బావా" అన్నాడు.

"పడుకుంటాలేరా" అన్నాను, బాగా డస్సి పోయిన స్వరంతో. అతను నా కంటే వయస్సులో చాలా చిన్న. నా పెళ్లయినప్పట్నుంచీ అతన్ని ఏరా అని పిలవడమే అలవాటు నాకు. ఈ చనువుకు మరో కారణం — అతను మూడేళ్ళ మా యింట్లో వుండి చదువుకోవడం కూడా కావచ్చు.

"ఫర్వాలేదు. ఇప్పుడే వచ్చేద్దాం, ఆటోలో వెళ్దాంలే" అంటూ బలవంతం చేశాడు.

లేవక తప్పలేదు నాకు.

నేను తయారయి బయటికి వచ్చే సరికి, గేటు ముందు ఆటోతో నిలబడి వున్నాడు రామదాసు.

గంట ఏడూ ముప్పై అయ్యింది. ఆటో బయల్దేరింది.

"చాలాసార్లు అనుకున్నాను— కడప వచ్చి మీ అందరితో సరదాగా వో వారం రోజులు గడిపి పోవాలని. ఏదీ పడిఛస్తేగా. ఎప్పుడూ కంపెనీ వ్యవహారాలూ, పనివొత్తిడీ. ఇక, ఇంటి సంగతీ నీకు తెలియనిదేం వుంది. కాత్యాయని దంతా అదో తరహా. ఈ నగరాన్ని వదిలితే ఆమెకు పిచ్చెక్కుతుందట. పిల్లలూ అదేవరస."

నేను వింటూ కూర్చున్నాను. మధ్య మధ్యలో 'ఆఁ ఊఁ' అంటూ, పొడిపొడిగా చిరునవ్వుని చిందిస్తూ, రామదాసు మొహంలోకి చూస్తున్నాను.

ఆ తర్వాత రామదాసు తన ఉద్యోగ విషయాలూ ఏవేవో చెప్పాడు.

ఆటో వొక బంగళా ముందు ఆగింది. దిగేము.

"రా..." అంటూ ముందుకు నడిచేడు రామదాసు. నేను అతన్ని అనుసరించేను.

బ్రహ్మాండమైన భవంతి అది. ముందు కొన్ని ఎకరాల విస్తీర్ణంలో తోట. దారికి రెండు వైపులా క్రోటన్సు, రంగు రంగుల పూల మొక్కలు. వాటి వెనగ్గా పచ్చటి లాన్సు.

అద్భుతమైన వాస్తుశిల్ప విన్నాణాన్ని చిందిస్తూ, ఎత్తైన మెట్లు, వాటికి చివర్లో గంభీరమైన గజరాజులూ; వరండా స్తంభాల మీద చిత్ర విచిత్రమైన శిల్ప సముదాయం.

వరండాలోకొచ్చేం. "ఎవరిదిరా ఈ ఇల్లు" అన్నాను, రామదాసుతో. నా కంఠస్వరంలో ఆశ్చర్యం. భయం, బెరుకు ధ్వనించాయని నాకే తెలుస్తోంది.

"చెప్తా...రా..." అంటూ కాలింగ్ బెల్ మ్రోగించాడు.

తలుపు తెరుచుకుంది. చెప్పులు బయట వదిలేము.

లోపలికి అడుగు బెట్టాము.

కాళ్లకింద మెత్తగా ముఖమల్ తివాచీ. దానిమీద నా పాదం మోపడానికే సంకోచం కలిగింది నాకు. ఎదురుగా గోడలకు నిలువెత్తు తైలవర్ణ చిత్రాలు; దుప్పి కొమ్ములు; హాలు మూలల్లో కళావిలసితమైన పూలకుండీలు.

సోఫాల్లో కూర్చున్నాము. డ్రింక్స్ వచ్చినై, తాగేము.

ఇంతలో వొక భారీ మనిషి హాల్లోకొచ్చి మా ముందున్న సోఫాలో కూర్చున్నాడు.



రామదాసు కళవళ పడిపోతూ, కంగారుగా లేచి నిలబడి "నమస్తే సార్" అంటూ రెండు చేతులెత్తి నమస్కరించాడు.

ఆయన చిరునవ్వుతో – కూర్చోమన్నట్టు చెయి వూపేడు.

రామదాసు ఎంతో వినయ విధేయతలతో ముళ్లమీద కూర్చున్నట్టు సోఫాలో ముందుకు కూర్చున్నాడు.

"మా బావగారు, గెజెటెడ్ ఆఫీసరు. కడపలో వుంటున్నారు" పరిచయం చేశాడు.

ఆయన తలపంకించాడు. నేను నమస్కారం పెట్టాను.

"వీరు మా ఛీఫ్ ఎగ్జిక్యూటివ్; బసవరాజు గారు" చెప్పాడు.

ఆయన వైపు తేరిపార చూశాను.

భారమైన దేహం. అడ్డూ ఆపూ లేకుండా పెరుగుతున్న బొజ్జ; ముఖాన్న రాటుతేలుతున్న ముడతలు; సూటూ బూటూ నిగనిగ మెరుస్తున్నాయి. బంగారు ఫ్రేము కళ్లద్దాలూ మెరుస్తున్నాయి. ఎడారిలో వొయాసిస్సుల్లా బట్టతలలో అక్కడక్కడా చిన్న చిన్న తెల్లవెంట్రుకలు. మొత్తం మీద ఆ మూర్తిలో వొక రీవి వుంది. సంపద తెచ్చిన రాజసం ఆయన మొహాన్న కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

వాతావరణంలో నిశ్శబ్దం ముద్దకట్టింది. తెల్లకాగితాలు హాలంతా పరచినట్లు వొక నైర్మల్యం అనిర్వచనీయంగా ప్రవహిస్తోంది.

# మయోస

మయోస అనే రూ 2. ధరగల పాకెట్‌లోని పరిమళద్రవ్యాన్ని గ్లాసునీటిలో కలిపితే తయారయే రూ.30. విలువచేసే అత్యుత్తమ షాంపూను మీరే స్వయంగా చేసుకోవచ్చు. దీనితో సుఖంగా అనేకసార్లు తలంటుకోవచ్చు కాబట్టి కుంకుడుకాయలకన్నా చాలా చౌక అన్నిషాపులలో దొరుకును. మీషాపువారికిది చూపి కోరితేమీకు వారు సప్లయిచేయగలరు పట్టణావారిపంపిణీదార్లు. డీలర్లుకావాలి. క్రింది ఎడ్రస్సుకువ్రాయండి.
దేశసేవ, హైదరాబాదు, 500890



**డా॥ వి. వి. కె. రావ్, B.A**

వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయనవసరం లేదు హస్తప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టుద్వారా చికిత్స కలదు.

**రావూస్ క్లినిక్**

టి. బి. రోడ్, తెనాలి

ఫోన్ . 3700 & 4010.



**మీకు బేబి/బాబు కావాలా**



ఆపరేషన్ ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష సంధ్యాదోష నివారణా నిపుణులు. * ఉచిత వివరములకు ·

**శ్రీ నాగార్జున మూలిక కుటీరం,**

రామాలయం వీధి, తెనాలి—2. | క్రవల్తైను, కేదారేశ్వరపేట, విజయవాడ—3.


# వాళ్ళిద్దరూ – నేనూ

ఏం మాట్లాడాలో ఏఁవిటో తెలీడం లేదు నాకు. మామూలుగా కనిపించాలని ఒక చిరునవ్వు నవ్వేను.

బసవరాజు నా చిరునవ్వుని స్వీకరించేడు. ప్రత్యభివాదం చేశాడు.

"మీ కామేశ్వరి పెళ్ళికి సంబంధాలు చూస్తున్నార్టగదా. మంచి సంబంధం చూడండి. కట్నకానుకల విషయంలో మీరేమీ భయపడకండి."

వాన లేకనే తలపైన పిడుగు పడ్డట్లైంది నాకు. ఆయన ఏం మాట్లాడుతున్నారో అర్థం కాలేదు.

"మరేం కంగారు పడకండి. ఆమె పెళ్లి బాధ్యత మీ మీద వున్నట్లు నాకు తెలుసు. మంచి సంబంధం చూసి కబురు చెయ్యండి. డబ్బు పంపుతాను. మనం మనం తర్వాత చూసుకోవచ్చు."

ఔదార్యం ఏ ఏ రూపాల్లో వుంటుందో తెలీనివాణ్ణి కాను గానీ— బసవరాజు చూపుతున్న ఈ ఔదార్యం నన్ను అస్థినాస్తి విచికిత్సలోకి త్రోసేసింది. అసలు జరుగుతున్నదేఁవిటో ఆకళింపు కాలేదు నాకు.

బసవరాజు ముక్కూ మొహం తెలీనివాణ్ణి నేను. కామేశ్వరి నా మేనకోడలు. ఆ పిల్ల పెళ్లి బాధ్యత నా నెత్తిన వున్నమాట నిజమేగానీ — దాన్ని నెరవేర్చలేనని భయంగానీ, దానికి కావలసిన డబ్బు గురించిన ఆందోళనగానీ నే నెవ్వరికీ వ్యక్తంచేయలేదే - ఏఁవిటీ వింత పరిణామం ?

చూపులతోనే రామదాసుని ప్రశ్నించాను — ఏఁవిటి ఇదంతా ? — అన్నట్టు.

అతను — ఆగు చెప్తాను — అన్నట్టు సైగచేశాడు.

మరోసారి తన హామీని పునర్వ్యక్తంచేస్తూ, లేచి నిమ్మళంగా గదిలోకి వెళ్లిపోయాడు, బసవరాజు.

మేమూ లేచి నిలబడ్డాము.

చేయ పుచ్చుకుని నన్ను బయటికి లాక్కొచ్చాడు రామదాసు. నేనతని ముఖంలోకి తేరిపార చూడలేకపోయాను.

ఎలా యింటికివచ్చి పడ్డానో తెలీదు. ఇల్లు చేరేను తనకేదో అత్యవసరమైన పని వుందంటూ సంజీవరెడ్డినగర్‌కి వెళ్లాలంటూ వెళ్లిపోయాడు రామదాసు. "రేపు వచ్చి వివరంగా మాట్లాడతాలే బావా" అంటూ వెళ్లాడు.

ఆ రాత్రి —

అనేక రకాలైన ఆలోచనలతో నాకు నిద్ర లేదు.

శారదకు చెప్పాను—జరిగిన విషయమంతా. "నువ్వేమైనా మీ తమ్ముడితో చెప్పావా — కామేశ్వరి పెళ్లి సంగతి ?" అని అడిగేను.

"ఏదో మాటవరసకి ఎప్పుడన్నా అన్నానేమో" అంది శారద.

మర్నాడు ఉదయం —

వెంటనే బయల్దేరి రావలసిందిగా గోపాల్ నుంచీ టెలిగ్రాం వచ్చింది నాకు. ఏదో ఆఫీసు పని అనివుంది.

హడావిడిగా బయల్దేరి వొక్కణ్ణే కడప వచ్చేశాను.

పది రోజులు గడిచాయి.

ఈ పది రోజులూ — నాకు రాత్రుళ్లు నిద్రలేదు. కన్ను మూసినా తెరచినా, అందమైన భవంతీ, అందులో బసవరాజు రూపం కనిపించసాగినై. ఆయన మాటలే చెవుల్లో మార్మోగసాగినై.

మా మాఁవగారిని హాస్పటల్‌నుంచీ ఇంటికి తీసుకొచ్చారు.

శారద తిరిగి కడపకు వచ్చేసింది.

"రామదాసు ఏమన్నా చెప్పాడా ?" అని అడిగేను, శారదని.

"నాకేం చెప్పలేదుగానీ — ఉత్తరం రాస్తానన్నాడు మీకు" అంది.

మరో నాలుగైదు రోజులకి — రామదాసు నుంచీ ఉత్తరం వచ్చింది. చాలాసార్లు చదువుకున్నాను. ఉత్తరమంతా సిరామరకలే. ఫిరంగిగుళ్లు వెదజల్లినట్లు ఆ మరకల మధ్యన అక్షరాలు !

మళ్లీ చదువుతున్నాను - మీరూ వినండి.

"బావా నువ్వేమీ అనుకోనంటే ఒక్క కోరిక కోరతాను. మీ మేనకోడలు కామేశ్వరి పెళ్లి బాధ్యత నీమీద వుంది. నువ్వా పిల్లకి పెళ్లి చెయ్యాలంటే తక్కువేమీ కాదు. అంత డబ్బు నీ దగ్గరలేదు. నీ పరిస్థితి నాకు తెలుసు. అలాగే, మా బసవరాజుగారు తన తమ్ముడి కూతురి పెళ్లి చెయ్యాలి. ఆ తమ్ముడికి ఆరుగురు ఆడపిల్లలు. అందరి బాధ్యతా ఈయనదే. ఈయనకి మీ గోపాల్ సంగతి చెప్పాను. కామేశ్వరి పెళ్లి అయితేనేగానీ గోపాల్ పెళ్లి ప్రసా్తవన తేనని నువ్వన్నట్లు నాకు తెలుసు. కనుక, బసవరాజు అవసరాన్నీ నీ అవసరాన్నీ కలిపి ముడివేశాను. "ఎందుకు ?" అని వెంటనే ప్రశ్నిస్తావ్ నువ్వు. అవును, ఇది నా అవసరానికీ పనికొస్తుంది. బసవరాజు చల్లగా చూస్తే నేనీ సంవత్సరం మా కంపెనీకి "కొనుగోళ్ల ఎగ్జిక్యూటివ్"ని కావచ్చు. నేను అత్యాశకేమీ పోవడంలేదని నా నమ్మకం. వీటికి నీ అంగీకారాన్ని తెలుపుతావు కదూ !"

రామదాసు ఎంతగా ఎదిగిపోయాడో అర్థమైంది నాకు. చిక్కులున్న దారపువుండలో ఏ కొసని ఎక్కడ పుచ్చుకుని లాగాలో బాగానే గ్రహిస్తున్నాడు. బతకనేర్చినవాడే !

ఒక్కసారి కుర్చీలో వెనక్కువాలి కళ్లు మూసుకున్నాను. నా గుండె గుండెలోనే వుంది; నేను మామూలు మనిషిగానే వున్నాను ! రామదాసు రాంగ్ నెంబర్‌ని డయల్ చేశాడు!!!

★